క్లుప్తంగా

కారు బీభత్సం

సీతమ్మధార : మద్యం సేవించి కారుతో బీభత్సం సృష్టించిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. బాలయ్యశాస్త్రి లేఅవుట్ ప్రాంతానికి చెందిన విశ్వనాథ్ శేఖర్ కారులో మంగళవారం రాత్రి సుమారు ఏడు గంటల సమయంలో తాటిచెట్లపాలెం జంక్షన్‌లో ఇద్దరు ద్విచక్రవాహనదారులను, ఓ కారును ఢీకొట్టాడు. ఈ ఘటనలో హరిబాబు, కృష్ణ తీవ్ర గాయాలయ్యాయి. దీంతో వీరిచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఆకాశ దీపారాధనకు ఏర్పాట్లు

మురళీనగర్ : కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 14వ తేదీ నుంచి ఆకాశ దీపారాధన నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో బి.ప్రసాద్ తెలిపారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ ఉత్సవాలు డిసెంబరు 12వ తేదీ వరకు జరుగుతాయన్నారు. ఆకాశ దీపారాధనలో పాల్గొనాల్సిన భక్తులు వారి గోత్ర నామాలతో పూజలు చేయడానికి రూ.200లు రుసుము చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఆలయ బ్యాంకు అకౌంటు, ఫోన్‌పే, గూగుల్ పే ద్వారా చెల్లించాలన్నారు.

అలరించిన సంగీత విభావరి

సీతంపేట: నటరత్న కల్చరల్ అసోసియేషన్, శారద స్వర సంగమం సంయుక్త నిర్వహణలో మంగళవారం సాయంత్రం పౌరగ్రంథాలయంలో నిర్వహించిన తెలుగు, హిందీ గీతాల కార్యక్రమం అలరించింది. సంస్థ వ్యవస్థాపకులు భయ్యాశ్రీనివాస్, లోకేష్ నిర్వహణలో నగరానికి చెందిన గాయకులు హుషారైన గీతాలు ఆలపించారు. ఈ కార్యక్రమంలో గాయనీగాయకులు మాధురి, గీతా,పద్మిని, కవిత, స్వరూప, శ్రీదేవి, లక్ష్మీసాత్విక, అమ్మాజి, నాగు,శ్రీనివాసరావు, రాంబాబు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు ఇబ్బంది లేకుండా చూడాలి

సీతమ్మధార : జీవీఎంసీ పరిధి 24 వార్డులోని ఉమానీలకంఠేశ్వర స్వామి ఆలయ ఆవరణను ఈవో పైలా శేఖర్‌బాబు పరిశీలించారు. ఆలయం సమీపంలో ప్రైవేట్ స్టాల్స్‌ను పరిశీలించారు. పార్కింగ్ ఇబ్బంది లేకుండా చూడాలని సూచించారు. అలాగే కార్తీక సోమవారం వస్తున్న సందర్భంగా ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో వనజాక్షి, శేఖర్ ,సిబ్బంది పాల్గొన్నారు.

స్టీల్ ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలి

సీతంపేట: విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమానికి 1000 రోజులు పూర్తయిన సందర్భంగా బుధవారం ఆంధ్రప్రదేశ్‌లోని విద్యా సంస్థల బంద్‌కు ఉత్తరాంధ్ర ప్రజా పార్టీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు రాజు గౌడ్ మద్దతు తెలిపారు. అక్కయ్యపాలెం శాంతిపురంలోపి పార్టీ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ మొండివైఖరికి నిరసనగా ఉత్తరాంధ్ర ప్రాంతంలోని ఏకై క స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగసంస్థగానే కొనసాగించాలన్నారు. బుధవా రం జరగనున్న బంద్‌ను విజయవంతం చేయాలన్నారు. బుధవారం ఉదయం 10:30 గంటలకు జీవీఎంసీగాంధీ విగ్రహం వద్ద నల్ల జెండాలతో నిరసన వ్యక్తం చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మెట్ట రామారావు, అధ్యక్షులు కర్రి ఆదిబాబు, ప్రధాన కార్యదర్శి ఎద్దు శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

ఘనంగా ఎన్టీపీసీ వ్యవస్థాపక దినోత్సవం

పరవాడ: ఎన్టీపీసీ 49వ వ్యవస్థాపక దినోత్సవాన్ని సింహాద్రి ఎన్టీపీసీ పరిపాలన భవనంలో ప్రాజెక్టు హెడ్ సంజయ్ కుమార్ సిన్హా ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఎన్టీపీసీ ఎండీ గురుదీప్‌సింగ్ ఉద్యోగులనుద్దేశించి మాట్లాడారు. సంస్థ ప్రగతిలో కీలక భూమిక పోషిస్తున్నారని అభినందించారు. అనంతరం సింహాద్రి ఎన్టీపీసీ ప్రాజెక్టు హెడ్ సిన్హా ఎన్టీపీసీ జెండాను ఆవిష్కరించి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్టీపీసీ 48 ఏళ్ల సుదీర్ఘ ప్రయాణంలో 73,874 ఎండబ్ల్యూ సాధించిందని వివరించారు. వేడుకల్లో భాగంగా హిందీ పక్వాడా పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.

రైతుబజారు కళకళ

- రైతుబజారుకు విశేష ఆదరణ
- రోజుకు 3 వేల మందిపైగా వినియోగదారులు కొనుగోళ్లు
- నిర్ణీత ధరలకే కూరగాయలు
- ఉదయం,సాయంత్రం అందుబాటులో..



తాజా కూరగాయలు విక్రయిస్తున్న రైతులు

కంచరపాలెం: ఊర్వశికూడలి సమీపంలోని కంచరపాలెం రైతుబజార్ నిత్యం వినియోగదారులతో కళకళలాడుతోంది. ఉదయం, సాయంత్రం వేళల్లో నిర్వహించే రైతుబజారుకు వినియోగదారుల తాకిడి పెరుగుతోంది. జీవీఎంసీ 54వ వార్డు పరిధిలో జాతీయరహదారికి కంచరపాలెం బీఆర్‌టీఎస్ రహదారికి ఆనుకొని ఏర్పాటు చేసిన రైతుబజారుకు జీవీఎంసీ 46,47,48,49, 54, 55, 56,57 వార్డులు ఊర్వశికూడలి, ఐటీఐ జంక్షన్, 104 ఏరియా, మర్రిపాలెం, జ్ఞానాపురం తదితర ప్రాంతాల నుంచి వినియోగదారులు ప్రతీ రోజూ 3 వేలకు పైగానే వస్తుంటారు. ఇక్కడ తాజా కూరగాయలతో పాటు, ఇతర నిత్యావసర సరకులు సైతం విక్రయిస్తుంటారు. రైతులతో పాటు, డ్వాక్రా గ్రూప్ మహిళలు, పండ్లు, పూలు, గిరిజన, సూపర్ మార్కెట్, డీసీఎంఎస్, విశాఖ డెయిరీ ద్వారా కూడా స్టాల్స్ ఏర్పాటు చేసి బయట మార్కెట్ కంటే తక్కువ ధరకే సరుకులు విక్రయిస్తున్నారు.

సంకల్పం గొప్పది....

నగర వాసులకు చెంతనే కూరగాయలు, నిత్యావసర సరకులు నిర్ణీత ధరలకు, డిమాండ్ సమయంలో ఉల్లిపాయలు, టమాటా సబ్సిడీ ధరలకు అందించాలనేది రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం. కంచరపాలెం రైతుబజారు నిర్వహణ ద్వారా సుమారు రూ.1.95లక్షల వరకు ఆదాయం వస్తోంది. రైతుబజార్ ఎస్టేట్ అధికారి (ఈవో) అటెండర్, స్కావెంజర్ల వేతనాలు, ఇతర నిర్వహణ ఖర్చులు పోనూ ప్రభుత్వానికి పెద్దగా మిగిలేది ఏమీ ఉండదు. బయట మార్కెట్లో కృత్రిమ కొరత, ధరల దోపిడీ వంటి చర్యలతో ఆర్థిక భారం లేకుండా వినియోగదారులకు మేలు చేయాలనే సంకల్పంతోనే ఇక్కడి రైతుబజారు నిర్వహిస్తున్నారు.

నేరుగా రైతులే వ్యాపారులు...

కంచరపాలెం రైతుబజారులో 189 మంది రైతులు అధికారికంగా ఉన్నారు. వీరిలో సుమారు 155 మందికి పైగా రైతుబజార్‌కు కూరగాయలు తీసుకొచ్చి విక్రయిస్తుంటారు. గుర్తింపు పొందిన రైతులు ఎటువంటి అద్దె చెల్లించాల్సిన అవసరం లేదు. వారు పండించిన పంటను బజార్‌కు తీసుకొచ్చి నేరుగా వారే వినియోగదారులకు విక్రయించుకునేలా ఏర్పాట్లు చేశారు. వినియోగదారులకు నాణ్యమైన, సరైన తూకంతో కూడిన కూరగాయలు అందేలా మార్కెటింగ్ శాఖాధికారులు పర్యవేక్షణ చేస్తుంటారు. చక్కటి పార్కింగ్‌తో వినియోగదారుల రాకపోకలు చేసేందుకు వీలుగా రైతుబజారుకు రెండు ప్రధాన ద్వారాలు ఏర్పాటు చేశారు.

రైతుబజారు విస్తీర్ణం	:	రెండెకరాలు..
రైతుబజార్ సమయాలు	:	రోజూ ఉదయం 6 నుంచి మధ్యాహ్నం12.30 వరకు. సాయంత్రం 4 -7 గంటల వరకు.
స్టాల్స్	:	114
రైతుల సంఖ్య	:	189
ఉదయం వచ్చే రైతుల సంఖ్య	:	114
సాయంత్రం వచ్చే రైతుల సంఖ్య	:	61
సమాచారం కోసం	:	శెట్టి కృష్ణమూర్తి ఎస్టేట్ అధికారి
సెల్ నంబర్	:	89197-79799.

ప్రతి మంగళవారం రైతుబజార్ సెలవు

పార్కింగ్ సమస్య లేకుండా చూడాలి



ఉదయం, సాయంత్రం వేళల్లో రైతుబజారులో తాజా కూరగాయలు మార్కెట్ శాఖాధికారులు నిర్ణయించిన ధరకే రైతులు విక్రయిస్తున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో రైతు బజార్ అందుబాటులో ఉండడం వినియోగదారులకు ఎంతో వెసులుబాటు. అయితే ప్రధాన ద్వారం వద్ద ప్రైవేటు వ్యక్తులు విక్రయాలతో పార్కింగ్ సమస్య ఇబ్బందిగా మారుతోంది.

–కొయ్య కుంచమ్మ, వినియోగదారు, గొల్లకంచరపాలెం,

దళారుల బెడద తప్పింది



రైతుబజారులో రైతులకు గుర్తింపు కార్డు ఇస్తున్నారు. మా పొలంలో పండించిన పంట తామే రైతుబజార్‌కు తీసుకొచ్చి విక్రయిస్తున్నాం. అన్ని ఖర్చులు పోనూ రోజుకు సుమారు రూ. 600లకు పైగానే మిగులుతోంది. గతంలో దళారులకు అమ్ముకోవాల్సి వచ్చేది. ఇప్పటి అలాంటి బాధ తప్పింది. రైతుబజారుకు వినియోగదారుల సంఖ్య పెరగడంతో లాభాలతో ఇంటికి వెళుతున్నాం. రైతుబజార్‌లో ఏర్పాట్లు కూడా బాగున్నాయి.

–బుజ్జమ్మ, రైతు, కంచరపాలెం రైతుబజారు.

సౌకర్యాలు కల్పిస్తున్నాం



రైతుబజార్‌లో వినియోగదారుల అవసరాల మేరకు కూరగాయలు, ఇతర నిత్యావసర సరకులు అందుబాటులో ఉండేలా శ్రద్ధ తీసుకుంటున్నాం. ఉన్నతాధికారుల పర్యవేక్షణలో రైతుబజార్ నిర్వహణ చేపడుతున్నాం. నిర్ణయించిన ధరలకే కూరగాయలు విక్రయించేలా చూస్తున్నాం. రైతుబజారులో ధరల పట్టిక నుంచి టాయిలెట్స్, పార్కింగ్, పరిశుభ్రతపై నిత్యం పర్యవేక్షణ ఉంటుంది.

–సీహెచ్ కృష్ణమూర్తి, ఎస్టేట్ అధికారి, కంచరపాలెం రైతుబజార్,

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఏసీపీ రాజీవ్ కుమార్

మర్రిపాలెం: అతివేగం, నిర్లక్ష్యం కారణంగా జరిగిన ప్రమాదాలపై కంచరపాలెం పోలీసులు అవగాహన కల్పించారు. ఊర్వశి జంక్షన్‌లో మంగళవారం ట్రాఫిక్ ఏసీపీ జి.రాజీవ్ కుమార్ ఆధ్వర్యంలో యువతకు సుప్ర వాహనం ద్వారా గతంలో జరిగిన ప్రమాదాలను ప్రదర్శిస్తూ ,ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించి ప్రమాదాలకు దూరంగా ఉండాలన్నారు. అలాగే గతంలో జరిగిన ప్రమాదాల వల్ల ప్రాణాలు కోల్పోయి, గాయపడిన వారు వీడియోలను చూపిస్తూ జాగ్రత్తగా ఉండాలని సూచించారు. మద్యం తాగి వాహనాలు నడపకూడదని, అలాగే హెల్మెట్ లేకుండా ప్రయాణాలు సాగించవద్దని సూచించారు. కార్యక్రమం కంచరపాలెం ట్రాఫిక్ సీఐ మళ్ల అప్పారావు, ఎస్‌ఐలు పాపారావు, వాసుదేవరావు, ఉల్‌హక్ పాల్గొన్నారు.

గంజాయి నిందితుల అరెస్ట్

సీతమ్మధార : గంజాయి కొలుగోలుదారులు, విక్రయదారుడ్ని పోలీసులు అరెస్టు చేశారు. విశాఖ నుంచి ప్రసింజిత్ గౌస్ కొంతకాలం బెంగళూరు నివాసమున్నాడు. తరువాత విశాఖలోని ఆరిలోవ వచ్చి జీవిస్తున్నాడు. బెంగళూరుకు చెందిన ఆసీఫ్‌ఖాన్, ప్రసింజిత్ గౌస్ స్నేహితులు. ఆసీఫ్‌ఖాన్ నిత్యం విశాఖ వస్తు గంజాయి కొనుగోలు చేసి, తన స్నేహితుడి ఇంట్లో ఉండి మళ్లీ బెంగళూరు వెళ్లేవాడు.

ఈ క్రమంలో మంగళవారం ఆసీఫ్ ఖాన్ బెంగళూరు నుంచి తన స్నేహితుడైన ప్రసింజిత్ గౌస్‌ను వెంటబెట్టుకుని మహారాణిపేటకు చెందిన క్రాంతికుమార్ వద్దకు వెళ్లి రెండు కిలోల గంజాయి కొనుగోలు చేశాడు. అనంతరం అక్కయ్యపాలెం నుంచి శాంతిపురం మీదుగా ఆరిలోవ వెళుతుండగా ఫోర్త్ టౌన్ పోలీసులకు సమాచారం రావడంతో సీఐ విజయకుమార్ ఆదేశాల్లో ఎస్‌ఐలు వెంకటరావు, ప్రమీల వీరిని అదుపులో తీసుకుని ప్రశ్నించగా..క్రాంతికుమార్ వద్ద గంజాయి కొనుగోలు చేసినట్టు ఆసీఫ్ ఖాన్ చెప్పాడు. దీంతో వీరిద్దని వెంటబెట్టుకుని మహారాణిపేటలో ఉంటున్న క్రాంతి కుమార్ వద్దకు పోలీసులు చేరుకున్నారు. అప్పటికే అక్కడ మరో ఇద్దరు బొద్దుల రాము, ప్రేమ్‌కుమార్‌లు గంజాయి కొనుగోలు చేస్తున్నారు. దీంతో గంజాయి కొనుగోలు చేసిన నలుగురితోపాటు నిందితుడు క్రాంతికుమార్‌ను అరెస్టు చేశారు. వీరి నుంచి నాలుగు కిలోల గంజాయితో పాటు కారు, రూ.42వేలు, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ వెంకటరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి నిందితుడికి రిమాండ్

సీతమ్మధార: అక్రమంగా గంజాయి తరలిస్తున్న వ్యక్తిని ఫోర్తుటౌన్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కేరళకు చెందిన అబ్దుల్ సలాం అల్లూరి జిల్లా అరకు నుంచి మధ్యవర్తి ద్వారా కేరళకు గంజాయితో విశాఖలోని రైల్వేస్టేషన్‌కు చేరుకున్నాడు. అనుమానస్పందంగా సంచరిస్తుండడంతో అక్కడ విధులు నిర్వహిస్తున్న సీఐ ఎస్. విజయకుమార్ తన సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు. విచారించగా గంజాయి తరలిస్తున్నట్లు చెప్పడంతో సలాం నుంచి రెండు కిలోలు గంజాయితో పాటు సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

మహాత్ముల బోధనలు అనుసరణీయం



మహిళలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న అతిథులు

తాటిచెట్లపాలెం: లోకహితార్థం జీవించే మహాత్ముల బోధనలు మానవాళికి అనుసరణీయమని, వారి జీవన విధానంలో నిస్వార్థ సేవ, దయ, దాక్షిణ్యాది గుణాలు ప్రస్ఫుటమవుతాయని జన శిక్షణ సంస్థాన్ చైర్మన్ సి.అచ్చుతరామరాజు తెలిపారు. మంగళవారం తాటిచెట్లపాలెంలోని మాస్టర్ ఈకే సంస్కృతి సదన్ ప్రాంగణంలో జగద్గురు పీఠం ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన మాస్టర్ కంభంపాటి పార్వతీకుమార్ 79వ జయంతి ఉత్సవ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాస్టర్ కంభంపాటి పార్వతీ కుమార్ ఆశయ సాధనలో భాగంగా సంస్కృతి సదన్‌లో గత 12 ఏళ్లుగా ట్రస్ట్ నిర్వహిస్తున్న పలు వృత్తి విద్యా శిక్షణా విధానాన్ని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. సభకు అధ్యక్షత వహించిన జగద్గురుపీఠం డైరెక్టర్ చింతలపాటి సత్యదేవ్ మాట్లాడుతూ పార్వతీకుమార్ రచనలు, ప్రభోదనలు నేడు భౌగోళికంగా ప్రాచుర్యం పొందాయన్నారు. ధనిష్టా ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ కె.గురుప్రసాద్ తదితరులు మాట్లాడారు. ఈ సందర్భంగా టైలరింగ్‌లో శిక్షణ పొందిన 30మంది మహిళలకు సర్టిఫికెట్లు, కొందరికి కుట్టుమిషన్లను అందజేశారు. కార్యక్రమంలో స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా విశ్రాంత డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎం.సాయినాథరావు, ట్రస్ట్ నిర్వాహక సభ్యులు బి.ఉషారాణి, పి.రవిశంకర్, డాక్టర్ ఎ. కృష్ణ ప్రసన్న, మహాత్మాగాంధీ మహిళా కేంద్రం నిర్వాహకురాలు దాట్ల రాధ పాల్గొన్నారు.

రైళ్లలో బాణసంచా రవాణా నిషేధం



విశాఖ రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున సివిల్ డిఫెన్స్ సభ్యులు

తాటిచెట్లపాలెం : దీపావళి సమీపిస్తున్న నేపథ్యంలో వాల్తేరు డివిజన్‌లో ప్రత్యేక డ్రైవ్‌లకు శ్రీకారం చుట్టింది. రైళ్లలో దీపావళి సామగ్రి తరలించకూడదని, మండే స్వభావం గల పదార్థాలు తరిలించకూడదని విస్తృత ప్రచారం చేస్తోంది. ఇందులో భాగంగాలో రైళ్లల్లో తనిఖీలు నిర్వహిస్తోంది. ప్రత్యేక స్క్వాడ్‌ను నియమించింది. డివిజన్ పరిధిలోని విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం రైల్వే స్టేషన్‌లలో రైల్వే అధికారులు, సివిల్ డిఫెన్స్ సభ్యులు, రైల్వే భద్రతా దళం సిబ్బంది రైళ్లలో తనిఖీలు నిర్వహిస్తున్నారని డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్ తెలిపారు. ప్రయాణికుల బ్యాగులను, లగేజీలను క్షుణ్ణంగా పరిశీలిస్తూ, ఎప్పటికప్పుడు వీటిపై అనౌన్స్‌మెంట్స్ ద్వారా ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఎవరైనా రైళ్లలో, రైల్వేస్టేషన్‌లలో టపాసులు, మండే ప్రమాదకర పదార్థాలు రవాణా చేస్తున్నట్లు గమనిస్తే వెంటనే రైల్వే అధికారులకు తెలియజేయాలని సూచించారు.

వహీదా రెహ్మాన్‌కు అభినందనలు



కేక్ కట్ చేస్తున్న ఫిల్మ్ సొసైటీప్రతినిధులు

సీతంపేట: దాదాసాహెబ్ ఫాల్కే జీవిత సాఫల్య పురస్కారం అందుకున్న విశాఖ మూలాలు కలిగిన ప్రముఖ చలన చిత్ర నటి వహీదా రెహ్మాన్‌కు వైజాగ్ ఫిల్మ్ సొసైటీ అభినందనలు తెలిపింది. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో సంస్థ కార్యదర్శి నరవ ప్రకాశరావు కేక్ కట్ చేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దక్షిణాది నుంచి బాలీవుడ్‌కి వెళ్లి అందం కంటే అభినయంతోనాటి తరం ప్రేక్షకుల్లో గుర్తింపు పొందిన వహీదాకు విశాఖతో విడదీయరాని బంధం ఉందన్నారు. వహీదా తండ్రి మున్సిపల్ కమిషనర్‌గా పనిచేశారని, అపుడు వహీదా సెయింట్ జోసఫ్ కాన్వెంట్‌లో చదువుకున్నారన్నారు. ఆవిధంగా ఆమె నట మూలాలు విశాఖలోనే ఏర్పడ్డాయన్నారు. తెలుగులో మొదట నటించిన తర్వాత బాలీవుడ్‌లో ప్యాసా చిత్రం ద్వారా నటన ప్రారంభించి తిరుగులేని నటిగా గుర్తింపు పొందారన్నారు. ఇప్పటికే పద్మశ్రీ, పద్మభూషణ్ పురస్కారాలు అందుకున్న వహీదా, 2006లో ఎన్టీఆర్ పురస్కారం అందుకున్నారని తెలిపారు. తాజాగా ఫాల్కే అవార్డుతో నటిగా అందనంత ఎత్తుకు చేరిందని కొనియాడారు. ఈ సందర్భంగా ఆమెపై రూపొందించిన డాక్యుమెంటరీని ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో బాబ్జి, శ్రీమన్నారాయణ, ఉషారాణి, హుస్సేన్, మూర్తి, ఎస్.ఎ.డీ.పాల్, గాయత్రి, ప్రభు, చాట్ల బాబూరావు పాల్గొన్నారు.

పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యం



శానిటరీ సిబ్బందితో మాట్లాడుతున్న జెడ్సీ కృష్ణ

కంచరపాలెం : జోన్–5లో గల 24 వార్డుల్లో పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని జోనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ అన్నారు. మంగళవారం జ్ఞానాపురం జోనల్ కార్యాలయంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ శానిటరీ సెక్రటరీలతో రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూజర్ ఛార్జీల వసూలులో నిర్లక్ష్యం వహిస్తే సిబ్బందిపై చర్యలు తప్పవన్నారు. రోడ్లు, డ్రైనేజీలు, గెడ్డల్లో చెత్తా చెదారాలు ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. క్లాప్ వాహనాల టైం విధిగా నమోదు చేయాలని సచివాలయ శానిటరీ సెక్రటరీలకు సూచించారు. ఇళ్ల నుంచి చెత్త సేకరణలో పారిశుధ్య సిబ్బందిపై పర్యవేక్షణ ఉండాలన్నారు. ప్రతివారం రివ్యూ సమావేశాలు నిర్వహిస్తామని, సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే కఠినంగా వ్యవహరిస్తామని జెడ్సీ హెచ్చరించారు. స్వచ్ఛ సర్వేక్షణ్, ఎకో వైజాగ్‌లో జోన్ ముందంజలో ఉండేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. సమావేశంలో పబ్లిక్ హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎ. సునిల్‌కుమార్, సూపర్‌వైజర్ జనార్దనరావు, ఆయా వార్డుల శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ శానిటరీ సెక్రటరీలు, జోన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజా శ్రేయస్సు కోరుకునే వ్యక్తి సీఎం జగన్

నెడ్‌క్యాప్ ఛైర్మన్ కేకే రాజు



బ్రోచర్ అందజేస్తున్న సమన్వయకర్త కె.కె.రాజు, కార్పొరేటర్ గోవింద్

సీతంపేట: ప్రతి క్షణం ప్రజా శ్రేయస్సు కోరుకునే వ్యక్తి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్ సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త , నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు అన్నారు. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా జీవీఎంసీ 25వ వార్డు రెల్లివీధి–1 సచివాయం పరిధిలో మధురానగర్, శాంతిపురం ప్రాంతాలలో వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్‌తో కలిసి పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ ప్రజా సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో కొండవాలు, మురికివాడ ప్రాంతాలు మౌలిక సదుపాయాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని గుర్తు చేశారు. జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన తర్వాత కొండవాలు ప్రాంతాలు, మురికివాడల్లో మెట్ల మార్గాలు, రహదారులు, డ్రెయిన్లు మెరుగుపర్చారన్నారు. సచివాలయాల ద్వారా ఆయా ప్రాంతాల లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు, ఇతర సేవలు అందజేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో 14వ వార్డు కార్పొరేటర్ కె.అనిల్ కుమార్ రాజు, డైరెక్టర్లు నూకరాజు, రాయుడు శ్రీను, 25వ వార్డు నాయకులు భోగవిల్లి గోవింద్, సారిపల్లి సంతోష్, హరికృష్ణ, అశోక్, అప్పన్న, గౌరినాయుడు, కొండలరావు, సన్నీ, వీరమ్మ, రత్నం, జయ, శ్రీను, సత్యనారాయణ, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

సీవీ రామన్‌ను ఆదర్శంగా తీసుకోవాలి



విజేతకు బహుమతి అందిస్తున్న ప్రిన్సిపాల్ వెంకటరమణ

మురళీనగర్: భారత్ రత్న, నోబెల్ బహుమతి గ్రహీత సీవీ రామన్ నేటి యువతకు ఆదర్శంగా తీసుకోవాలని కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ (గైస్) ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ అన్నారు. సీవీ రామన్ జయంతిని కాలేజీలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలోనే చదువుకుని ఇక్కడే పరిశోధనలు చేసి రామన్ ఎఫెక్ట్‌ను ఆవిష్కరించి నోబుల్ పురస్కారాన్ని అందుకున్న ఏకైక భారతీయ శాస్త్రవేత్తగా ఆయన గుర్తింపు పొందారని చెప్పారు. రామన్‌కు మొదట్లో శబ్దశాస్త్రం పట్ల ఆసక్తి ఉండేదని అనంతరం ఆయన కాంతిపై పరిశోధనలు చేశారని వివరించారు. రామన్ ఎఫెక్ట్ కనిపెట్టడానికి ఆయనకు కేవలం రూ.250లు మాత్రమే ఖర్చు అయ్యిందని చెప్పారు. పరిశోధనలు చేయాలనుకుంటే అధునాతన సౌకర్యాలు అవసరం లేదని క్రియేటివిటీ ఉంటే అందుబాటులో ఉన్న వనరులతోనే నూతన ఆవిష్కరణలు చేయవచ్చని రామన్ నిరూపించినట్లు ఆయన పేర్కొన్నారు. విద్యార్థులు పరిశోధన రంగంవైపు వెళ్లేందుకు రామన్ స్ఫూర్తిగా నిలిచారన్నారు. విశాఖతో ఆయనకు అనుబంధం ఉందని చెప్పారు. విద్యార్థులు ఉన్నత చదువులతో పాటు పరిశోధనల పట్ల ఆసక్తి పెంచుకోవాలని ఆయన సూచించారు. ముందుగా సర్ సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో విజేతలు డి.బేబీ శృతిక, కె.సాయి ప్రణతిలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో విభాగాధిపతులు డాక్టర్ బీవీ లక్ష్మణరావు, సీహెచ్. జయప్రకాష్ రెడ్డి, ఎస్.ప్రశాంతి కుమారి, డి.దామోదర్, స్టూడెంట్ అడ్వయిజర్ బి.రామాంజనేయులు, అధ్యాపకులు జ్యోతి, ప్రదీప్ కుమార్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

అనధికార దత్తత నేరం



మాట్లాడుతున్న డీఎల్‌ఎస్‌ఏ జడ్జి శేషమ్మ

మర్రిపాలెం: చిన్నారుల అనధికారిక దత్తత చట్టపరంగా నేరమని డీఎల్‌ఎస్‌ఏ జడ్జి శేషమ్మ అన్నారు. అంతర్జాతీయ దత్తత మాసం సందర్భంగా మర్రిపాలెంలోని శిశుగృహను ఆమె మంగళవారం సందర్శించారు. అక్కడ ఆశ్రయం పొందుతున్న చిన్నారుల యోగక్షేమాలను తెలుసుకున్నారు. అలాగే వారికి అందిస్తున్న పౌష్టికాహారంపై ఆరా తీశారు. అనంతరం దత్తత తీసుకున్న తల్లిదండ్రులతో కాసేపు మాట్లాడారు. ఎవరైనా దత్తత తీసుకోవాలనుకునే వారు చట్టపరమైన ప్రక్రియ పూర్తి చేయాలని తెలిపారు. అంతకముందు బాలింతలతో సమావేశం నిర్వహించిన పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పీడీ వెంకటేశ్వరి, సీడీపీవో రమణకుమారి, సీడబ్ల్యూ మెంబర్ లక్ష్మి, డీసీపీ రమేష్, పీవోఎస్‌ఐసీ మమత, శిశుగృహ మేనేజర్ సుజాత, రామలక్ష్మి పాల్గొన్నారు.

వాహనదారులు హెల్మెట్ ధరించాలి



అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఎస్‌ఐ

సీతమ్మధార : టూవీలర్ ఉన్న ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించాలని ద్వారకా ట్రాఫిక్ ఎస్‌ఐ. రామ్మూర్తి అన్నారు. మంగళవారం ద్వారకానగర్‌లోని శ్రీచైతన్య జూనియర్ కళాశాల విద్యార్థులకు ట్రాఫిక్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.